దృష్టి లోపంపై అలసత్వం తగదు

● డాక్టర్ రాజా నారాయణన్



సమావేశంలో మాట్లాడుతున్న రెటీనా కంటి వైద్యులు

బంజారాహిల్స్, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): దృష్టి లోపంపై అలసత్వం తగదని, 90 శాతం అంధత్వం నివారించదగినదని ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్, అనంత్ బాజాజ్ రెటీనా ఇన్‌స్టిట్యూట్ నెట్‌వర్క్ డైరెక్టర్ డాక్టర్ రాజా నారాయణన్ తెలిపారు. ప్రపంచ రెటీనా దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్‌లో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా రెటీనా సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య పెరిగిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా డయాబెటీస్ రోగుల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంటుందని, నిర్లక్ష్యం చేయడం వల్ల దృష్టి పూర్తిగా పోయే ప్రమాదం ఉందన్నారు. సమయానికి రెటినా సమస్యను గుర్తించడం వల్ల ప్రత్యేకమైన ఇంజెక్షన్లతో చికిత్స చేసి చూపును కాపాడవచ్చన్నారు. మందులు, పరికరాల్లో నూతన ఆవిష్కరణలతో డీఎంఈ, ఎన్ఏఎండీ వంటి రెటినల్ వ్యాధుల చికిత్సలో సవాళ్లను అధిగమించవచ్చన్నారు. భారతదేశంలో అంధత్వానికి రెటీనా రుగ్మతలు 4.7 శాతం (2010) నుంచి 8 శాతానికి (2019) పెరిగిందన్నారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ స్మిత్ కనూరి సంతమ్మ సెంటర్ ఫర్ విట్రియో డిసిజెస్ హెడ్ డాక్టర్ ముదిత్ త్యాగి మాట్లాడుతూ, దేశంలో రెటినల్ వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని, సమయానికి సరైన చికిత్స తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు.

యునానీ ఆసుపత్రిలో నేటి నుంచి మెథడాలజీ, హెచ్‌ఆర్డీ కోర్ రీసెర్చ్‌పై వర్క్‌షాప్

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని యునానీ ఆసుపత్రిలో గురు,శుక్రవారాల్లో (ఈనెల 26,27 తేదీల్లో) మెథడాలజీ, హెచ్‌ఆర్డీ కోర్ రీసెర్చ్ కార్యక్రమంపై వర్క్ షాప్ జరుగుతుందని ఆస్పత్రి డిప్యూటీ డైరెక్టర్ యూనిస్ ఇఫ్తికార్ మున్షీ తెలిపారు. భారత ప్రభుత్వ అయుష్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి భావన సక్సేనా ఈ వర్క్‌షాపును ప్రారంభిస్తారని ఆయన అన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 50 మంది ప్రతినిధులు యునానీ విభాగం పరిశోధన అధికారులు, సైంటిస్టులు ఇందులో పాల్గొంటారని తెలిపారు.



నియామాక పత్రాలను అందిస్తున్న ఎండీ అశోక్ రెడ్డి

వాటర్‌బోర్డులో ఏడుగురికి కారుణ్య నియామకం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డులో ఏడుగురికి కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు లభించాయి. బోర్డులో విధులు నిర్వర్తిస్తుండగానే మరణించిన ఏడుగురు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు.. వారి వారి విద్యార్హతల మేరకు కారుణ్య నియామకం కింద ఉపాధి కల్పించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్ రెడ్డి బుధవారం వారికి నియామక పత్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కష్టపడి పని చేసి బోర్డుకు మంచి పేరు తీసుకురావాలని ఆయన వారికి సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సుదర్శన్, సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఉచిత ఆరోగ్య శిబిరం

వాటర్‌బోర్డు ఉద్యోగులకు ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఈ శిబిరాన్ని ఈడీ మయాంక్ మిట్టల్ ప్రారంభించారు. అనంతరం ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ హెల్త్ క్యాంపులో.. బీపీ, షుగర్, ఈసీజీ, ఆప్తమాలజీ స్క్రీనింగ్, డెంటల్, కొలెస్ట్రాల్ తదితర పరీక్షలు నిర్వహించారు. ప్రధాన కార్యాలయంలో పనిచేసే దాదాపు 200 మంది ఉద్యోగులు ఈ శిబిరంలో ఆరోగ్య పరీక్షలు చేసుకున్నారు.

బాధితుల వివరాలు సేకరించిన రెవెన్యూ సిబ్బంది

రెజిమెంటల్‌బజార్, సెప్టెంబర్ 25 (ఆంధ్ర జ్యోతి): సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లోని ఓల్డ్ జైల్‌ఖానా గోడ కూలి ఉపాధి కోల్పోయిన బాధితుల వివరాలను రెవెన్యూ సిబ్బంది బుధవారం సేకరించారు. ఓల్డ్ జైల్‌ఖానా గోడ కూలి ఉపాధి కోల్పోయిన వారిని ఆదుకోవా లని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కోరారు. ఎన్నో ఏళ్లుగా ఇరవై కుటుంబాలు టైలరింగ్ వృత్తి చేసుకుంటూ ఇక్కడ జీవనోపాధి పొందుతున్నాయని, షాపులు కూలిపోవడం వలన ఉపాధి కోల్పోయారని కలెక్టర్‌కు ఆయన వివరించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తితో స్పందించిన కలెక్టర్ బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, కలెక్టర్ ఆదేశాలతో బుధవారం సికింద్రాబాద్ తహసీల్దార్ పాండు నాయక్, ఇతర రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధితుల వివరాలు సేకరించారు.

ఇంగ్లి‌ష్‌లో 'బ్రెయిలీ' పాఠ్యపుస్తకాలు

● త్వరలో అందించనున్న అధికారులు



బ్రెయిలీ ప్రింటింగ్ ప్రెస్‌లో పంపిణీకి సిద్ధంగా ఉన్న ఇంగ్లిష్ పాఠ్యపుస్తకాలు

ఓల్డ్‌మలక్‌పేట, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): అంధ విద్యార్థుల పాఠ్యపుస్తకాల ముద్రణ ఇప్పటి వరకు తెలుగుభాషలోనే జరగగా, ఇప్పుడు ఆంగ్ల మాధ్యమంలో చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అంధ విద్యార్థులకు కూడా ఆంగ్లమాధ్యమం ప్రవేశపెట్టాలనే ఉద్దేశంతో మొట్టమొదటి సారిగా ఇంగ్లిష్‌లో బ్రెయిలీ లిపి పాఠ్యపుస్తకాల ముద్రణ చేపట్టారు. ఓల్డ్‌మలక్‌పేటలోని వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయంలో ఉన్న బ్రెయిలీ ప్రింటింగ్ ప్రెస్‌లో పాఠ్యపుస్తకాల ముద్రణ కొనసాగింది. ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ముద్రించిన పాఠ్యపుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. త్వరలో వీటిని విద్యార్థులకు అందించనున్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇండెంట్‌తోపాటు విద్యార్థుల యూడీ ఐడీ కార్డులు జత చేసి పాఠ్యపుస్తకాలు తీసుకుపోవాలని బ్రెయిలీ ప్రింటింగ్ ప్రెస్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. తెలంగాణలో మహబూబ్‌నగర్, కరీంనగర్, హైదరాబాద్‌లో మూడుచోట్ల, ఆదిలాబాద్, వరంగల్, నల్లగొండ జిల్లాల్లో అంధ పాఠశాలలు కొనసాగుతున్నాయి.

జల్సాల కోసం చోరీలు

● లలితా జ్యువెలరీ మార్ట్ లో చెవి రింగులు చోరీ చేసిన ఇద్దరి అరెస్టు



నిందితులు నర్సింగ్ రావు, అరుణ

పంజాగుట్ట, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): జల్సాల కోసం నగల దుకాణంలో బంగారు ఆభరణాలు దొంగిలిస్తున్న ఇద్దరు పాత నేరస్తులను పంజాగుట్ట పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. గత నెల 6వ తేదీన ఒక మహిళ, ఒక వ్యక్తి పంజాగుట్టలోని లలితా జ్యువెలరీ మార్ట్‌కు వచ్చారు. మొదటి అంతస్తులోని చెవిపోగుల విభాగంలోకి వెళ్లి చెవిపోగులు చూస్తున్నట్టు నటించారు. సిబ్బంది దృష్టి మళ్లించి 12.2 గ్రాముల బరువు ఉన్న రెండు బంగారు చెవి రింగులను బ్యాగులో పెట్టుకుని వెళ్లిపోయారు. ఈ విషయాన్ని సిబ్బంది గమనించలేదు. 7వ తేదీ ఉదయం సిబ్బంది వివిధ అంతస్తుల్లో ఉన్న బంగారు ఆభరణాల లెక్కను సరి చూడగా, చెవి పోగుల విభాగంలో ఒక జత చెవి రింగులు కనిపించలేదు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా 6వ తేదీన వచ్చిన మహిళ, వ్యక్తి వాటిని దొంగలించినట్టు గుర్తించారు. షోరూమ్ మేనేజర్ మొగిలి ప్రసాద్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు మల్కాజిగిరి జిల్లా నేరేడ్‌మెట్ వినాయక్ నగర్‌కు చెందిన ఎలక్ట్రీషియన్ కౌడ నర్సింగ్ రావు(40), పాత సఫిల్‌గూడకు చెందిన టైలర్ కారుపర్తి అరుణ(34)లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 12.2 గ్రాముల బంగారు చెవి రింగులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జల్సాలకు అలవాటు పడ్డ వీరిద్దరూ దొంగతనాలు చేస్తున్నారని, గతంలో కూడా కూకట్‌పల్లి పోలీసులు వీరిని అరెస్టు చేశారని డీఐ శ్రావణ్ కుమార్ తెలిపారు.

సీసీ కెమెరాలతో భద్రతకు భరోసా

"ఓ ఇంట్లో సుమారు రూ. 20 లక్షల విలువ చేసే ఆభరణాలు చోరీకి గురయ్యాయి. నిందితుడు కనీసం సెల్‌ఫోన్ కూడా ఉపయోగించలేదు. కానీ సంఘటన జరిగిన అరకిలో మీటరు పరిధిలో ఉన్న సీసీ కెమెరా వల్ల నిందితుడి ఆచూకీ తేలింది. పోలీసులు నిందితుడిని పట్టుకొని చోరీ సొత్తును రికవరీ చేశారు".

"పదవ తరగతి చదువుతున్న విద్యార్థి సోదరుడిపై అలిగి ఇల్లు వదిలి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించగా, ఇద్దరు కానిస్టేబుళ్లు సుమారు 105 సీసీ కెమెరాలను పరిశీలించి 11 గంటల పాటు శ్రమించి బాలిక ఆచూకీ తెలుసుకోగలిగారు".



● ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్న కాలనీలు, బస్తీలు
● నిరంతర నిఘా కోసం అదనపు వసతులు
● జూబ్లీహిల్స్‌లో సత్ఫలితాలు ఇస్తున్న కెమెరాలు

బంజారాహిల్స్,సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో సీసీ కెమెరాల అవశ్యకత పెరిగింది. దీంతో కాలనీలు, బస్తీలు అనే తేడా లేకుండా అన్ని చోట్ల నిఘా నేత్రాల ఏర్పాటుకు పోలీసులు కసరత్తు చేస్తున్నారు. కొంత ఆలస్యమైనప్పటికీ అన్ని వర్గాల ప్రజలు సీసీ కెమెరాల కోసం విరాళాలు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు. నిర్దేశించుకున్న లక్ష్యంలో పోలీసులు యాభై శాతం అధిగమించారు. అయితే నిఘానేత్రాలు ఏర్పాటు చేసినప్పటికీ అనేక కారణాల వల్ల కొన్ని ప్రాంతాల్లో కెమెరాలు పనిచేయడం లేదు. దీంతో నేరాలు జరిగినప్పటికీ ఆధారాలు దొరకక దర్యాప్తులో ఆలస్యమౌతోంది కెమెరాలు పనిచేయడానికి అవసరమైన విద్యుత్ కనెక్షన్లను స్థానిక వ్యాపారుల వద్ద నుంచి తీసుకుంటున్నారు. అయితే, కొన్నిచోట్ల వ్యాపారులు విద్యుత్ కనెక్షన్లను తొలగిస్తుండటంతో సీసీ కెమెరాలు పని చేయడం లేదు. అంతేకాకుండా గాలి దుమారం ఇతర సాంకేతిక సమస్యల కారణంగా కొన్నిచోట్ల సీసీ కెమెరాలు పని చేయడంలేదు. ఇలాంటి సమస్య భవిష్యత్‌లో తలెత్తకుండా కాలనీ సంక్షేమ సంఘాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయి. జూబ్లీహిల్స్, బీఎస్ రెడ్డి కాలనీలో ఇలాంటి ఏర్పాట్లే చేశారు.

అండర్ గ్రౌండ్ కేబులింగ్..

బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 14లో బీఎస్ రెడ్డి కాలనీలో అత్యంత శక్తివంతమైన 16 కెమెరాలను ఏర్పాటు చేశారు. గాలి, వాన వల్ల ఇవి పనిచేయడం ఆగిపోకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. కాలనీలో కెమెరాల వైరింగ్ అండర్ గ్రౌండ్ నుంచి వేశారు. స్తంభాలు, కెమెరాలు ఎటువంటి వాతావరణాన్ని అయినా తట్టుకునేలా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి ఆటంకం లేకుండా విద్యుత్ సరఫరా జరుగుతుండటంతో నిరంతరాయంగా సీసీ కెమెరాలు పని చేస్తున్నాయి.

సామాజిక బాధ్యతను చాటుకుంటున్నారు..

ప్రముఖులు, ఉన్నతాధికారులు, రాజకీయ నేతలు, ధనవంతులు ఉండే కాలనీగా నగరంలో జూబ్లీహిల్స్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇలాంటి కాలనీలో భద్రత మరింత పటిష్టం చేసేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పోలీసులు నిర్ణయించారు. అయితే కాలనీలోని అనువణువు కెమెరాల్లో రికార్డు అయ్యేలా ఉండాలని సొసైటీ అత్యాధునిక నిఘా నేత్రాల ఏర్పాటుకు సిద్ధమైంది. లండన్ తరహాలో ఇక్కడ రూ.4 కోట్ల నిధులతో అత్యాధునిక పరిజ్ఞానం గల 400 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కెమెరాల ఏర్పాటుకు సొసైటీ సభ్యుల్లో పది మంది లక్షల్లో విరాళాలు అందజేయగా, ఓ కంపెనీ ఏకంగా కోటి రూపాయలు విరాళంగా ఇచ్చింది. మిగతాది సొసైటీ వెచ్చించింది.

నిర్వహణ కూడా..

సీసీ కెమెరాలు అమర్చిన కంపెనీ మూడేళ్ల పాటు నిర్వహణ బాధ్యత తీసుకుంది. కెమెరాలు పనిచేసేందుకు పోలీసులు గతంలో స్థానిక వ్యాపార కేంద్రాలను ఆశ్రయించే వారు. కానీ జూబ్లిహిల్స్ సొసైటీ అలా కాకుండా కెమెరాలన్నింటినీ కలుపుతూ 54 కొత్త విద్యుత్ మీటర్లు తీసుకున్నారు. ప్రతి నెలా రూ.50 వేలు విద్యుత్ బిల్లు వస్తుండగా, దానిని సొసైటీనే భరిస్తోంది.

సీసీ కెమెరాలతో స్వీయరక్షణ సాధ్యం



గ్లోబల్‌నగరంగా మారుతున్న హైదరాబాద్‌లో స్వీయ రక్షణ చాలా అవసరం. ప్రతి ఒక్కరికీ ఒక్కో రక్షభటుడిని ఇవ్వడం సాధ్యం కాదు. ఈ క్రమంలో సీసీ కెమెరాలతోనే పూర్తి భద్రత సాధ్యమవుతుంది. ఒక కెమెరా వంద మంది కానిస్టేబుళ్లతో సమానంగా పనిచేస్తుంది. సీసీ కెమెరాల అవసరాలపై ప్రజల్లో అవగాహన తీసుకువస్తున్నాం. ఇప్పటికే 80 శాతం మంది ముందుకు వచ్చారు. ఇంకా కొంత మంది స్పందించాల్సిన అవసరం ఉంది. కెమెరాల వల్ల భవిష్యత్‌లో అనేక ఇబ్బందులను అధిగమించవచ్చు.

- సామల వెంకట్‌రెడ్డి, బంజారాహిల్స్, ఏసీపీ

అవయవదానంపై విద్యార్థులు అవగాహన కల్పించాలి

● మంత్రి దామోదర రాజనర్సింహ



రక్తదానం చేస్తున్న విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

బంజారాహిల్స్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా హెల్త్ సెక్టార్‌కు మంచి డిమాండ్ ఉందని, దానికి తగ్గట్టుగానే తెలంగాణ ప్రభుత్వం కూడా వైద్య రంగంలో వివిధ విభాగాల్లో ఉన్న విద్యార్థులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రపంచ ఫార్మసిస్ట్ డే సందర్భంగా బుధవారం బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం ఫార్మసీ కాలేజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ రక్త దాన శిబిరాన్ని మంత్రి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, విద్యార్థులకు సామాజికసేవా దృక్పథం ఉండటం ఎంతో అభినందనీయమని, రక్త దానం చేస్తున్న విద్యార్థులు అవయవదానంపై కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వేలాది మంది రోగులు వివిధ సమస్యలతో అవయవాల కోసం ఎదురు చూస్తున్నారని, అవయవదానం వల్ల కూడా ఎంతో మందికి పునర్జన్మ ఇచ్చినవారం అవుతామని అన్నారు. కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ మహ్మద్ వలియుల్లా, గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, మాజీ ఐఏఎస్ అజయ్ మిశ్రా, ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరానగర్ కాలనీవాసులతో మాట్లాడుతున్న రాజ్‌భవన్ సిబ్బంది

ఇందిరానగర్‌ను దత్తత తీసుకోనున్న గవర్నర్?

● పరిశీలించిన రాజ్‌భవన్ అధికారులు

ఖైరతాబాద్,సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్‌లోని ఇందిరానగర్ కాలనీని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దత్తత తీసుకోనున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు బుధవారం రాజ్‌భవన్ అధికారులు, సిబ్బంది ఇందిరానగర్ కాలనీతో పాటు పరిసర ప్రాంతాలను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. గవర్నర్ 27వ తేదీన ఇందిరానగర్‌కు వచ్చి దత్తత విషయాన్ని ప్రకటిస్తారని, ఇందుకోసం జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్ శాఖ అధికారులతో పలు అంశాలపై చర్చిస్తున్నట్టు సమాచారం. ఒక ఏడాది పాటు గవర్నర్ దత్తత తీసుకోనున్న నేపథ్యంలో తమ కాలనీకి మంచి రోజులు వస్తాయని, డ్రైనేజీ మురుగు సమస్యతో పాటు వర్షం వస్తే ముంపునకు గురయ్యే సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు జోరుగా చర్చించుకుంటున్నారు.


లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు

అమీర్‌పేట,సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): పంతాలు, పట్టింపుల కు పోకుండా ఈ నెల 28న నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌కు హాజరై తమ తమ కేసులను పరిష్కరించుకోవాలని ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు కక్షిదారులను కోరారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని అవసరం కొద్దో, ఆవేశం కొద్దో పెట్టుకున్న కేసులను రాజీ చేసుకోవాలన్నారు. ఈ అదాలత్‌లో పాత కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి పంపకాలు, భార్యాభర్తల పంచాయితీలు, బ్యాంక్ రికవరీలు, చెక్ బౌన్స్, డ్రకన్ డ్రైవ్ కేసులు, ఎక్కువగా ఉన్న పెండింగ్ చాలన్లు, కొట్లాటలు, రోడ్డు ప్రమాదాలు, ఎక్సైజ్, దొంగతనం, పేకాట లాంటి కేసులు పరిష్కరించబడతాయన్నారు. ఎలాంటి పంతా లకు పోకుండా మానసిక ప్రశాంతత కోసం రాజీ ఉత్తమ మార్గం అని అన్నారు. లోక్ అదాలత్ కేసులలో ఎలాంటి సందేహాలు ఉన్న నేరుగా తనను లేదా పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగాన్ని సంప్రదించవచ్చని ఇన్‌స్పెక్టర్ సైదులు అన్నారు.

ఏబీఎన్-ఆంధ్రజ్యోతి కార్యక్రమానికి ఆరాధన టీవీ ప్రతిభా పురస్కారం



నాగరాజుకు పురస్కారం అందజేస్తున్న జస్టిస్ శేషశయనారెడ్డి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ న్యూస్‌చానల్ ఏబీఎన్-ఆంధ్రజ్యోతిలో ప్రసారమయ్యే ప్రత్యేక కార్యక్రమానికి ఆరాధన 30వ టీవీ ప్రతిభా పురస్కారం లభించింది. బుధవారం రాత్రి త్యాగరాయగాన సభలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శేషశయనారెడ్డి ఏబీఎన్-ఆంధ్రజ్యోతిలో ప్రసారమవుతున్న వ్యవసాయం ఎట్ ఆర్గానిక్ కార్యక్రమ రచయిత, నిర్మాత నాగరాజును సన్మానించి పురస్కారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీవీలలో ప్రసారమవుతున్న కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో దర్శకుడు రేలంగి నరసింహారావు, లంక లక్ష్మీనారాయణ, చిల్లా రాజశేఖరరెడ్డి, హనుమంతరావు, నిర్వాహకులు లోకం కృష్ణయ్య, నిర్మలా ప్రభాకర్, రేణుకా ప్రభాకర్, ఉమర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

● 'సమగ్ర కులగణన - సామాజిక న్యాయం' సదస్సులో వక్తల డిమాండ్



సదస్సులో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, బీఎస్ రాములు, గుజ్జ కృష్ణ, గుజ్జ సత్యం,రాపోల్ జ్ఞానేశ్వర్ తదితరులు

పంజాగుట్ట, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థలు, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. వచ్చేది బీసీల యుగం, బీసీల రాజ్యమని, కులం అడ్డుగోడలను ఛేదించడానికి మహా ఉద్యమం రావాలని అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం, కొండా లక్ష్మణ్ బాపూజీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'సమగ్ర కులగణన - సామాజిక న్యాయం'పై రాష్ట్ర స్థాయి అఖిల పక్ష సదస్సు జరిగింది. సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, ఫౌండేషన్ సెక్రెటరీ జనరల్ రాపోల్ జ్ఞానేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్.రమణ, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు తదితరులు మాట్లాడారు. బీసీలపై కనిపించని వివక్ష కొనసాగుతున్నదని ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. స్థానిక సంస్థలు, చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు సాధించడానికి, సమస్యల పరిష్కారానికి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని అన్నారు. బీసీ రాజ్యాధికారం సాధించడానికి మహా ఉద్యమం రావాలన్నారు. మన కలలు సాకారం అయినప్పుడే కొండా లక్ష్మణ్ బాపూజీకి నిజమైన నివాళి అని కృష్ణయ్య అన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి బహిరంగ సభలో బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎమ్మెల్సీ ఎల్.రమణ డిమాండ్ చేశారు. గుజ్జ సత్యం మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెంచకపోతే రాష్ట్ర ప్రభుత్వంతో యుద్ధమే జరుగుతుందని హెచ్చరించారు. సమగ్ర కులగణనతోనే సామాజిక న్యాయం సాధ్యమని అన్నారు. సదస్సులో సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ,లాల్ కృష్ణ, సురేష్, కిరణ్, శ్రీకాంత్ గౌడ్,మునుగోడు మాజీ జెడ్పీటీసీ బొల్లి శివకుమార్,వేముల రామకృష్ణ,వివిధ బిసి కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



పండిట్ దీన్ దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మహనీయుల జీవితం అందరికీ ఆదర్శం

బంజారాహిల్స్, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతి కోసం కష్టపడిన మహనీయుల జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యుడు కె. బోజిరెడ్డి అన్నారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు ఫిలింనగర్‌లో బుధవారం జరిగాయి. బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బోజి రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు చిట్ట చివరి వ్యక్తికి కూడా అందాలని పండిట్ దీన్‌దయాళ్ భావించేవారన్నారు. ఇదే ఆశయంతో ప్రధాని మోదీ సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గడ్డం వెంకటస్వామి, ముద్దంగుల శ్రీనివాస్, కొత్త నీరజ, కస్తూరి మహిపాల్, దండుగుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీన్ దయాళ్ జయంతి సందర్భంగా సనత్‌నగర్‌లో ఆయన చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించిన డివిజన్ అధ్యక్షుడు కన్నూరి క్రాంతికుమార్ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు ఈ. దయానంద్, సీనియర్ నాయకులు లింగంపల్లి నర్సింగ్ రావు, జిల్లా అధికార ప్రతినిధి మూల రవీందర్, ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ కన్నూరి చంద్రకుమార్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఐలయ్య, సీవీ శ్రీనివాస్, రాంప్రసాద్ తదితరులు. (సనత్‌నగర్-ఆంధ్రజ్యోతి)

28, 29 తేదీల్లో తల్లిపాల ప్రాముఖ్యతపై అంతర్జాతీయ సదస్సు



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు సంతోష్ కుమార్, దుర్గాభవాని, నితాషా బగ్గా

పంజాగుట్ట, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): సుషేనా హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధాత్రి మదర్స్ మిల్క్ బ్యాంక్, వివిధ సంస్థల సహకారంతో ఈ నెల 28, 29 తేదీల్లో నగరంలోని పది ఆసుపత్రులు, గ్రీన్ ల్యాండ్స్ లోని మ్యారీ గోల్డ్ హోటల్ లో సౌత్ ఆసియా లాంబ్యాన్ పేరుతో 4వ అంతర్జాతీయ సదస్సు జరుగనుంది. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ సదస్సులో జాతీయ, అంతర్జాతీయ వైద్యులు, నిపుణులు తల్లిపాల ప్రాముఖ్యత, పాలు ఇచ్చేటప్పుడు తల్లికి వచ్చే చిన్న చిన్న సమస్యలు తదితర అంశాలపై సలహాలు, సూచనలు అందిస్తారని జాతీయ వైద్య కమిషన్ సభ్యుడు, సుషేనా హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సంతోష్ కుమార్ క్రాలేటి తెలిపారు. అంతేకాకుండా తల్లి పాలు ఎలా సేకరించాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కూడా తెలియజేస్తారని అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షు రాలు డాక్టర్ కె. దుర్గా భవాని, సదస్సు కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ నితాషా బగ్గాలతో కలిసి ఈ నెల 28,29 తేదీల్లో తల్లిపాల ప్రాముఖ్యతపై నిర్వహించనున్న సౌత్ ఆసియా లాంబ్యాన్ అంతర్జాతీయ సదస్సు పోస్టర్‌ను ఆవి ష్కరించారు. సదస్సులో నేషనల్ మెడికల్ మిషన్ చైర్మన్, పద్మశ్రీ డాక్టర్ బీఎన్ గంగాధర్, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, రిషి హుడ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ శోభిత్ మాథుర్, దేశ,విదేశాలకు చెందిన పిడి యాట్రీషియన్లు, నియోనాటాలజిస్టులు, గైనకాలజిస్టులు పాల్గొంటారని అన్నారు.

జంక్‌ఫుడ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలి

ఖైరతాబాద్,సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జంక్ ఫుడ్‌తో పాటు రసాయనాలు వాడిన ఫాస్ట్ ఫుడ్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యాలను కాపాడుకోవాలని వాసవీ ఆస్పత్రి వైద్యులు సూచించారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ (ఐఐఎంసీ) కళాశాలలో విద్యార్థులకు వాసవీ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో జనరల్ ఫిజిషియన్, ఆప్తమాలజీ, గైనకాలజీ, పల్మనాలజీ వైద్యులతో పాటు ల్యాబ్ సిబ్బంది రక్త గ్రూపింగ్ పరీక్షలు చేశారు. దాదాపు 400 మంది విద్యార్థులు వైద్య పరీక్షలు చేయించుకొని అవసరమైన వారు మందులు తీసుకున్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ ప్రారంభించగా, వాసవీ ఆస్పత్రి చైర్మన్ జి.చంద్రయ్య, కార్యదర్శి కొండ్లె మల్లికార్జున్‌తో పాటు వైద్యులు విద్యార్థులకు ఆరోగ్య చిట్కాలు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్‌తిరుమలరావు, సంతోషి, విజయానంద్, విజయ్ పాల్గొన్నారు.

జెన్‌కో ద్వారానే పవర్ ప్లాంట్‌ను నిర్మించాలి : జేఏసీ

● నేటి నుంచి నల్లబ్యాడ్జీలతో నిరసన

హైదరాబాద్ సిటీ సెప్టెంబర్ 25 (ఆంధ్ర జ్యోతి) : రామగుండంలో జెన్‌కోకు చెందిన స్థలంలో నిర్మించతలపెట్టిన పవర్‌ప్లాంట్‌ను జెన్‌కో ద్వారానే నిర్మించాలని తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ తీర్మానించింది. యూనియన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 26న నల్ల బాడ్జీలతో నిరసన, ఈనెల 30 నుంచి సదస్సులు, సమావేశాలు, భోజన విరామంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని జేఏసీ నిర్ణయించింది. ప్రభుత్వం తన నిర్ణయం మార్చుకోకుంటే వచ్చేనెల 10 నుంచి నిరసనలు ఉధృతం చేస్తామని జేఏసీ చైర్మన్ సాయిబాబా తెలిపారు. సమావేశంలో కన్వీనర్ రత్నాకర్ రావు, కో చైర్మన్ శ్రీధర్, కో కన్వీనర్ బీసి రెడ్డి వైస్ చైర్మన్ అనిల్ కుమార్, వజీర్, శ్యామ్ మనోహర్, నాగ తులసి రాణి, కరుణాకర్ రెడ్డి, రాంజీ , సదానందం, వెంకట్ నారాయణ రెడ్డి, సుధీర్ , శ్రీనివాస్, ఈశ్వర్ గౌడ్ , వేణు, రమేష్ పాల్గొన్నారు.



కూరగాయల వ్యాపారులకు సభ్యత్వాలు అందజేస్తున్న బీజేపీ మహంకాళి జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి తదితరులు

స్వచ్ఛందంగా బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారు

బౌద్ధనగర్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీ సభ్యత్వం తీసుకొంటున్నారని ఆ పార్టీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. బుధవారం బౌద్ధనగర్ డివిజన్ ఎల్.నారాయణనగర్‌లో కో-ఆర్డినేటర్ యాదమ్మ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సారంగపాణి డివిజన్‌లోని ప్రజలు, చిరువ్యాపారులకు బీజేపీ సభ్యత్వం అందజేశారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ ఇప్పటి వరకు సికింద్రాబాద్ నియోజకవర్గంలో దాదాపు 60 వేల మంది బీజేపీ సభ్యత్వం తీసుకున్నారన్నారు. ప్రతీ కార్యకర్త ఇంటింటికి వెళ్లి సభ్యత్వం చేయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, వనమాల శ్రీనివాస్, ఓములు ముదిరాజ్, శ్యామ్, మమత, జయశ్రీ, దేవుడు కుమార్, ఈఎల్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



చిలకలగూడలోని రైల్వే కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పెన్షనర్లు

పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలి

చిలకలగూడ, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడలోని ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమన్ ఫెడరేషన్ కార్యాలయం ఎదుట బుధవారం రైల్వే పెన్షనర్స్ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్షుడు యస్.శ్రీధర్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 18 నెలల కరువు భత్యం బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. పెన్షన్ పెంపుకి వయసు పరిమితి తగ్గించాలని, పెన్షనర్లకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమమంలో ఫెడరేషన్ ప్రతినిధులు వై.యుగంధర్, యస్.రాజు, కె.యస్.స్వామి, శివకుమార్, గిరిజ తదతరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమన్ ఫెడరేషన్ 64వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వెరికోస్ వెయిన్స్‌తో బాధపడుతున్న పెన్షనర్లకి డాక్టర్.భార్గవ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు రాసి ఇచ్చారు. రైల్వే పెన్షనర్లకి మెరుగైన ఆరోగ్యం కొరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు శ్రీధర్ తెలిపారు.



మూడు చక్రాల బండ్లను అందజేస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర, శానిటరీ సూపర్‌వైజర్ ధనగౌడ్ తదితరులు

పారిశుధ్య కార్మికులకు తోపుడు బండ్లు అందజేత

రాంగోపాల్‌పేట్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ చీర సుచిత్ర, శానిటరీ సూపర్‌వైజర్ ధనగౌడ్ పారిశుధ్య కార్మికులకు తోపుడు బండ్లను అందజేశారు. రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని శ్రీఉజ్జయినీ మహాకాళి ఆలయం సమీపంలో చెత్త, వ్యర్థాల తొలగింపునకు నూతనంగా తయారు చేసిన మూడ చక్రాల తోపుడుబళ్లను కార్పొరేటర్ చీర సుచిత్ర, శానిటరీ సూపర్‌వైజర్ ధనగౌడ్ బుధవారం పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా రోడ్లపై చెత్తవేయబోమని, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా స్వచ్ఛతను పాటిస్తామని స్థానికులతో వారు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీజీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, డివిజన్ అధ్యక్షుడు ఆకుట ప్రతాప్, ప్రధాన కార్యదర్శి నరేష్, మహంకాళి సికింద్రాబాద్ జిల్లా లగ్విస్టిక్ మైనార్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి నితేష్ బోలే, డివిజన్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్, చీర శ్రీనివాస్, ధనరాజ్, కిరణ్, మహిళా మోర్చా నాయకురాళ్లు నిర్మల, అంజు కపాడియా తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ సీఐ కల్పన, ఆర్పీఎఫ్ పోలీసులు

రైలు పట్టాల వద్ద సెల్ఫీలు దిగితే కఠిన చర్యలు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): రైళ్ల రాకపోకలు సాగిస్తున్న సమయంలో పట్టాల వద్ద సెల్ఫీలు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని నాంపల్లి రైల్వే ఆర్పీఎఫ్ సీఐ కల్పన హెచ్చరించారు. స్వచ్ఛభారత్ పక్షోత్సవాల సందర్భంగా నాంపల్లి రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలు, రైల్వే ట్రాక్ సమీపంలోనీ కాలనీల వద్ద ప్రజలకు బ్యానర్లు ప్లకార్డుల ద్వారా బుధవారం అవగాహన కల్పించారు. రైల్వే గేటు మూసి ఉన్నప్పుడు ఎవరూ దాటొద్దని సూచించారు.



ప్రిన్సిపాల్ సరితను సత్కరిస్తున్న తోటి ఉద్యోగులు

ఉత్తమ కళాకారులుగా తీర్చిదిద్దడానికి కృషి

చిలకలగూడ, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి, శ్రీభక్త రామదాసు ప్రభుత్వ సంగీత కళాశాలలో బుధవారం కర్ణాటక, హిందూస్థానీ గాత్రం, భరత నాట్యం, వాద్య కచేరీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సరిత కర్ణాటక విద్వాంసురాలు ఎం. ఎస్ సుబ్బలక్ష్మి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో కర్ణాటక, హిందూస్థానీ గాత్రం, భరతనాట్యం వీణ, వయొలిన్, మృదంగ వాద్యాలలో శిక్షణ అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులలో దాగి వున్న సృజనాత్మకతని వెలికితీసి ఉత్తమ కళాకారులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్ సరతను, ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన పేరిణి నృత్య లెక్చరర్ పవన్‌కుమార్‌ను కళాశాల లెక్చరర్లు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం బాధాకరం

వేంకటేశ్వరాలయంలో లష్కర్ జిల్లా సాధన సమితి నిరసన దీక్ష

బౌద్ధనగర్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) భక్తులకు అందజేస్తున్న లడ్డూ ఎంతో పవిత్రమైనదని, అటువంటి లడ్డూ తయరీలో కల్తీ నెయ్యి, జంతువుల కొవ్వులను వినియోగించడం బాధాకరమని పలువురు పేర్కొన్నారు. సీతాఫల్‌మండి, నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లష్కర్ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం ఒక్కరోజు నిరసన దీక్ష చేపట్టారు. వివిధ పార్టీల నాయకులు, భక్తులు వారికి సంఘీభావం తెలిపారు. లష్కర్ జిల్లా సాధన సమితి చైర్మన్ గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, పలువురు నాయకులు మాట్లాడుతూ టీటీడీ లడ్డూ అనగానే ప్రతిభక్తుడు కళ్లకు అద్దుకుని తింటారన్నారు. అలాంటి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యిని, జంతువు కొవ్వులను కలపడం వలన భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని అన్నారు. ఇందుకు బాధ్యులైన అధికారులను, పాలకమండలిని విధుల నుంచి తొలగించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తీవ్రమైన పరిమాణాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తిరుమల పవిత్రను కాపాడి భక్తుల మనోభావాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఆలయచైర్మన్ నోముల ప్రకాశరావు, వివిధ పార్టీ నాయకులు రవిప్రసాద్‌గౌడ్, మేకల సారంగపాణి, కరాటేరాజు, రాచమల్ల కృష్ణమూర్తి, కుంచాల ఏడుకొండలు, ర్యాల మహేందర్‌యాదవ్, ప్రభుగుప్తా, సాధనసమితి సభ్యులు సాదం బాలరాజ్‌యాదవ్, శైలేందర్, మిట్టపల్లి బాబురావు, అశోక్, సునీల్, జగదీష్, కృష్ణముదిరాజ్, జబర్దస్త్ ఆర్టిస్టు శ్రీహరి, సహస్ర పారాయణ మండలి మహిళ సభ్యులు, విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం, బ్రాహ్మణసంఘం తదితరులు పాల్గొన్నారు.



నిరసన దీక్షలో వివిధ పార్టీ నాయకులు

సమస్యలను పరిష్కరించడంలో ప్రజల విశ్వాసం పొందాలి

మారేడపల్లి, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఉంటూ సమస్యలను పరిష్కరించిన వారిని ప్రజలు ఎల్లప్పుడు ఆదరిస్తారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించడంలో ప్రజల విశ్వాసం పొందాలని ఆయన అన్నారు. మెండా డివిజన్ పరిధి, ఓల్డ్ మారేడుపల్లిలోని ఎరుకలబస్తీ, లక్ష్మయ్య దొడ్డి ప్రాంతాలలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే శ్రీగణేష్ పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. విద్యుత్, తాగునీరు, రోడ్ల సమస్యలను బస్తీవాసులు, మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలన్నింటిపై శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే శ్రీగణేశ్ స్థానికులకు హామీ ఇచ్చారు. అర్హులైన కుటుంబాలకు రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ పథకాలు అందజేయడానికి ప్రభుత్వం రూపకల్పన చేసిందని వాటిని త్వరగా అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈలు ధర్మారెడ్డి, ఆంజనేయులు, డీసీ సమ్మయ్య, వాటర్ వర్క్స్ డీజీఎం సాగర్, ఏఈ హకీం, ఓల్డ్ మారేడుపల్లి ఎరుకల బస్తీ అధ్యక్షుడు యగ్నేష్ కుర్మా, ప్రధాన కార్యదర్శి ఉదయ్ కుమార్ కుర్మా, ఉపాధ్యక్షుడు విశ్వనాథ్ కుర్మా, నాయకులు సంతోష్ యాదవ్, బద్రీనాథ్ యాదవ్, శ్యాంసుందర్ రెడ్డి, సంకీ రవీందర్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్

ఘనంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

బౌద్ధనగర్/రాంగోపాల్‌పేట్/సనత్‌నగర్, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): భారతీయ జనసంఘ్ నాయకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు బుధవారం బౌద్ధనగర్‌లో ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువత 'దీన్‌దయాళ్' ఆశయాలు, సిద్ధాంతాలను పాటించి క్రమశిక్షణతో ముందుకు నడవాలని ఆయన సూచించారు. అనంతరం బౌద్ధనగర్ న్యూఅశోక్‌నగర్‌లో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు కే కుమార్, కాసాల నగేశ్, సుబ్బారావు, ఎడ్ల సత్యనారాయణ, కిషన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

- పాన్‌బజార్‌లోని రాంగోపాల్‌పేట్ డివిజన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కార్పొరేటర్ చీర సుచిత్ర పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్, డివిజన్ అధ్యక్షుడు ఆకుల ప్రతాప్, కార్యకర్తలు పాల్గొన్నారు.
- సనత్‌నగర్‌లో డివిజన్ అధ్యక్షుడు కన్నూరి క్రాంతికుమార్ బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఈ.దయానంద్, సీనియర్ నాయకులు లింగంపల్లి నర్సింగ్‌రావు, జిల్లా అధికార ప్రతినిధి మూల రవీందర్, ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ కన్నూరి చంద్రకుమార్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు ఐలయ్య, సివి. శ్రీనివాస్, రాంప్రసాద్ తదితరులు దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.



దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న క్రాంతికుమార్, దయానంద్ తదితరులు



దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సుచిత్ర తదితరులు



పండిట్ దీన్‌దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవిప్రసాద్‌గౌడ్

ఆగమ విద్యార్థులకు మార్గనిర్దేశం చేసిన రమాకాంతాచార్యులు

కొత్తపేట, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): ఎందరో ఆగమ విద్యార్థులకు మార్గనిర్దేశం చేసిన ఘనత సముద్రాల రమాకాంతాచార్యులకే దక్కుతుందని త్రిదండి చినజీయర్‌స్వామి కొనియాడారు. ఆగమశాస్త్ర పండితుడు మద్వాధుల సముద్రాల రమాకాంతాచార్యులు(80) ఈనెల 13న నాగోల్‌లో తుదిశ్వాస విడిచారు. స్నేహపురి కాలనీలోని గోదా సమేత పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని శ్రీనివాస మండపంలో బుధవారం సముద్రాల రమాకాంతాచార్యుల పరమపదోత్సవం ఘనంగా నిర్వహించారు. పరమపదోత్సవం త్రిదండి చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో సముద్రాల శ్రీమన్నారాయణాచార్యుల అధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా శాస్త్రోక్తంగా వేదపండితుల సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా త్రిదండి చిన జీయర్‌స్వామి మాట్లాడుతూ తమ ఆశ్రమాలలో ప్రధానంగా యజ్ఞయాగాది క్రతువులన్నీ రమాకాంతాచార్యులు చేశారన్నారు.

2000 సంవత్సరం కృష్ణా వసంతోత్సవాలకు వారే ప్రధాన యజ్ఞాచార్యులుగా ఉన్నారని జీయర్‌స్వామి గుర్తుచేశారు. రమాకాంతాచార్యులు శతాధిక దేవాలయాల ప్రతిష్ఠలు చేశారని పలువురు కొనియాడారు. స్నేహపురి గోదా సమేత పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి రమాకాంతాచార్యులు స్థానాచార్యులుగా వ్యవహరించారని అన్నారు. కార్యక్రమంలో అహోబిల రామానుజ జీయర్, అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజ జీయర్, రామచంద్ర రామానుజ జీయర్ స్వాములు వివిధ ప్రాంతాల వేదపండితులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న త్రిదండి చిన జీయర్‌స్వామి

అంధ విద్యార్థులకు

ఇంగ్లిష్‌లో 'బ్రెయిలీ' పాఠ్యపుస్తకాలు

- త్వరలో అందించనున్న అధికారులు

ఓల్డ్‌మలక్‌పేట సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): అంధవిద్యార్థుల పాఠ్యపుస్తకాల ముద్రణ ఇప్పటివరకు తెలుగుభాషలోనే జరగగా, ప్రస్తుతం ఆంగ్లమాధ్యమం (ఇంగ్లిష్)లో ముద్రణ చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అంధ విద్యార్థులకూ ఇంగ్లిష్ మాధ్యమం ప్రవేశపెట్టాలనే ఉద్దేశంతో తొలిసారిగా ఇంగ్లిష్‌లో బ్రెయిలీ లిపి పాఠ్యపుస్తకాల ముద్రణ చేపట్టారు. ఓల్డ్‌మలకపేటలోని దివ్యాంగుల కార్పొరేషన్ కార్యాలయంలోని బ్రెయిలీ ప్రింటింగ్ ప్రెస్‌లో పాఠ్యపుస్తకాల ముద్రణ కొనసాగింది. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ముద్రించిన పాఠ్యపుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. త్వరలో వీటిని విద్యార్థులకు అందించనున్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇండెంట్‌తోపాటు విద్యార్థుల యూడీ ఐడీ కార్డులు జతచేసి పాఠ్యపుస్తకాలు తీసుకుపోవాలని బ్రెయిలీ ప్రింటింగ్ ప్రెస్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. తెలంగాణలో మహబూబ్‌నగర్, కరీంనగర్, హైదరాబాద్‌లో మూడుచోట్ల, అదిలాబాద్, వరంగల్, నల్లగొండ జిల్లాల్లో అంధ పాఠశాలలు కొనసాగుతున్నాయి.



దివ్యాంగుల కార్పొరేషన్ కార్యాలయం బ్రెయిలీ ప్రింటింగ్ ప్రెస్‌లో పంపిణీకి సిద్ధంగా ఇంగ్లిష్ పాఠ్యపుస్తకాలు



మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామిగౌడ్

మల్లారెడ్డి, నీలిమా కాలేజీలలో

మెడికల్ కౌన్సెలింగ్‌ను నిలిపివేయాలి

తార్నాక, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): డీమ్డ్ యూనివర్సిటీలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు అమలు చేయకుండా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని వెంటనే నిలిపివేయాలని బీసీ విద్యార్థి సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని మల్లారెడ్డి మెడికల్ కాలేజీ, నీలిమా మెడికల్ కాలేజీలు రిజర్వేషన్లను తుంగలో తొక్కి మెడికల్ సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. బీసీ విద్యార్థి సంఘం నాయకులతో కలిసి ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మల్లారెడ్డి మెడికల్ కాలేజీ, నీలిమ మెడికల్ కాలేజీల యాజమాన్యాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను తప్పుదారి పట్టించి బడుగు బలహీనవర్గాల విద్యార్థులను మెడికల్ విద్యకు దూరం చేసే కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. రిజర్వేషన్లనను అమలు చేయకుండా మెడికల్ సీట్లను భర్తీ చేయడంతో ప్రతిభ ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మల్లారెడ్డి మెడికల్ కాలేజీ, నీలిమ మెడికల్ కాలేజీ యాజమాన్యాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను అమలు చేసేంత వరకు మెడికల్ కౌన్సెలింగ్ నిలిపివేయాలని కోరారు.

ఘనంగా ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం

తార్నాక, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తార్నాకలోని సరోజినీ నాయుడు ఫార్మసీ మహా విద్యాలయ యాజమాన్యం బుధవారం ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవ వేడుకలను కళాశాల ఆవరణలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఐపీసీఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ సి. గోపాలకృష్ణమూర్తి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రపంచ ఆరోగ్య అవసరాలను తీర్చడంలో ఫార్మసిస్టుల పాత్రపై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల విద్యార్థులతో కలిసి తార్నాక పరిసర ప్రాంతాల్లో ర్యాలీని నిర్వహించారు.

కార్యక్రమంలో సరోజినీ నాయుడు ఫార్మసీ మహా విద్యాలయ చైర్మన్ డాక్టర్ బి. ప్రభాశంకర్, జనరల్ సెక్రటరీ కె. రాంప్రసాద్‌రెడ్డి, ఆర్. అగర్వాల్, జె. రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న డాక్టర్ గోపాలకృష్ణమూర్తి

28న మెగాలోక్ ఆదాలత్

- నాంపల్లిలోని మనోరంజన్ కాంప్లెక్స్‌లో

అమీర్‌పేట, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): పంతాలు, పట్టింపులకు పోకుండా కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు చెప్పారు. నాంపల్లిలోని మనోరంజన్ కాంప్లెక్స్‌లో ఈ నెల 28న మెగాలోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు. ఇందులో భార్యభర్తల గొడవలు, కొట్లాట, పాత కేసులు, సివిల్ తగదాలు, ఆస్తి పంపకాలు, బ్యాంకు రికవరీలు, చెక్ బౌన్స్ వాహన పెండింగ్ చలాన్లు తదితర కేసులను పరిష్కరిస్తారు. కేసుల పరిష్కారానికి రాజీమార్గం ఉత్తమమని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వివరాలకు నేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగాన్ని సంప్రదించాలన్నారు.



లయన్స్ క్లబ్ ప్రతినిధులతో విద్యార్థులు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

పద్మారావునగర్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మారేడుపల్లి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వైసీ సుంకీ సూచించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి కృష్ణానగర్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు 350 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు స్వరూప లయన్స్ క్లబ్ ప్రతినిధులను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లోనా డిమ్మి, స్వరాజ్, రామచందర్, ఉపాధ్యయులు పాల్గొన్నారు.



నాగరాజుకు పురస్కారం అందజేస్తున్న జస్టిస్ శేషశయనారెడ్డి

'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కార్యక్రమానికి

ఆరాధన టీవీ ప్రతిభా పురస్కారం

చిక్కడపల్లి, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ న్యూస్ చానల్ 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'లో ప్రసారమయ్యే ప్రత్యేక కార్యక్రమానికి ఆరాధన 30వ టీవీ ప్రతిభా పురస్కారం లభించింది. బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శేషశయనారెడ్డి ఏబీఎన్-ఆంధ్రజ్యోతిలో ప్రసారమవుతున్న వ్యవసాయం ఎట్ ఆర్గానిక్ కార్యక్రమ రచయిత, నిర్మాత నాగరాజును సన్మానించి పురస్కారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీవీలలో ప్రసారమవుతున్న కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో దర్శకుడు రేలంగి నరసింహారావు, లంక లక్ష్మీనారాయణ, చిల్లా రాజశేఖరరెడ్డి, హనుమంతరావు, నిర్వాహకులు లోకం కృష్ణయ్య, నిర్మలా ప్రభాకర్, రేణుకా ప్రభాకర్, ఉమర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

అడ్డగుట్ట, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన లాలాసింగ్(32) నగరానికి వచ్చి హయత్‌నగర్‌లో అతడి బంధువు రామ్‌కేశ్ వద్ద ఉంటూ టైలర్ పనిచేసుకుంటున్నాడు. కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా అనారోగ్యంగో బాధపడుతున్నాడు. ఈ నెల 19న లాలాసింగ్‌ను తీసుకుని రామ్‌కేశ్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. రామ్‌కేశ్ టికెట్ తీసుకుని రావడానికి కౌంటర్ వద్దకు వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి లాలాసింగ్ కనిపించలేదు. ఆందోళన చెందిన అతడు రాజస్థాన్‌లోని బంధువులకు సమాచారం ఇచ్చారు. అనంతరం రైల్వేస్టేషన్ సమీపంలోని ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దాంతో మరుసటి రోజు గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, వారు స్టేషన్ పరిధిలోని సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం మిస్సింగ్ కేసు కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వేణుగోపాల్ తెలిపారు.



లాలా సింగ్

జీడిమెట్లలో సద్గురు ఇంజనీరింగ్ కంపెనీలో

యంత్రం మీదపడి కార్మికుడి మృతి

జీడిమెట్ల, సెప్టెంబర్ 25(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలోని వినాయకనగర్‌లో ఓ పరిశ్రమలో పనికి వెళ్లిన కార్మికుడిపై యంత్రం పడటంతో తీవ్రగాయాలు పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. జీడిమెట్ల పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కృష్ణా జిల్లా మచిలీపట్నం చెందిన శ్రీనివాసరావు(35) బోరబండలో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. జీడిమెట్ల వినాయకనగర్ సమీపంలోని సద్గురు ఇంజనీరింగ్ కంపెనీలో పనిచేయడానికి బుధవారం సాయంత్రం వెళ్లాడు. డీసీఎంలో వచ్చిన మిషన్ దింపుతుండగా అదుపుతప్పి మిషన్ కార్మికుడిపైన పడటంతో మృతిచెందాడు. ఈ మేరకు జీడిమెట్ల పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.